క్లుప్తంగా

ఇద్దరి వ్యక్తుల బైండోవర్



బైండోవర్ చేస్తున్న పోలీసులు

సిర్పూర్(టి): మండల కేంద్రంలో మంగళవారం రాత్రి అనుమానస్పదంగా సంచరిస్తున్న ఇద్దరి వ్యక్తులను సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ ఎదుట బైండోవర్ చేశారు. సిర్పూర్(టి) గ్రామానికి చెందిన షేక్ జావిద్, షేక్ గౌస్ అనే ఇద్దరు వ్యక్తులను ఒక సంవత్సరం కాల పరిమితికి రెండు లక్షల రూపాయలకు బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.

యువకుడిపై కేసు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) గ్రామ పంచాయతీకి చెందిన రహెమత్ అనే యువకుడు సెల్ ఫోన్లో ఆన్‌లైన్‌లో మట్కా, సట్టా ఆడుతుండగా సిర్పూర్(టి) ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో మట్కా సట్టా ఆడుతున్న రహెమత్ వద్ద నుంచి ఆపిల్ ఫోన్, వెయ్యి రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

నిత్యావసర సరుకులు పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న నాయకులు

రెబ్బెన: మండలంలోని తుంగెడకు చెందిన నిరుపేద పడిగాల బుచ్చయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా కాంగ్రెస్ యువ నాయకుడు పూదరి హరీశ్ గురువారం మృతుడి కుటుంబానికి రూ. 25 కిలోల బియ్యంతో పాటు ఇతర సరుకులు అందచేశారు. అధైర్యపడవద్దని కుటుంబానికి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు డోంగ్రి తిరుపతి, శ్రీనివాస్, మల్లయ్య, మురళీ, వేణు పాల్గొన్నారు.

వంట పాత్రల పంపిణీ



వంట పాత్రలు పంపిణీ చేస్తున్న ఎంఈవో

దహెగాం: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లోని మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి వంట పాత్రలను మంజూరు చేసింది. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వంట పాత్రలను ఎంఈవో శ్రీనివాస్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులు వంట పాత్రలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మండలంలో 41 ప్రభుత్వ పాఠశాలలకు వంట పాత్రలు మంజూరైనట్లు తెలిపారు. అలాగే గ్యాస్ పొయ్యి కూడా అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ రమేశ్

కౌటాల: వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామని కౌటాల సీఐ ముత్యం రమేశ్ అన్నారు. బుధవారం పోలీసులు మీ కోసం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని తలోడి చౌరస్తాలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు సేవ చేయడం పోలీసుల లక్ష్యమన్నారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): సిర్పూర్(టి) పోలీసుల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా బుధవారం చలివేంద్రాన్ని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం ప్రారంభించారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని ప్రయాణికులకు చల్లని నీటిని అందించారు. కార్యక్రమంలో కౌటాల సీఐ ముత్యం రమేశ్, ఎస్సై కమలాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కానరాని ఆర్టీసీ సేవలు



- ఉచిత ప్రయాణానికి దూరం
- గ్రామీణ ప్రాంతాల్లో ఆటోలే దిక్కు
- పట్టించుకోని అధికారులు

లింగాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. దీంతో పట్టణాలు, పల్లెల్లో మహిళలు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. అయితే లింగాపూర్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు అవుతున్నా.. మండలానికి ఆసిఫాబాద్ డిపో నుంచి ఒకే ఒక్క బస్సు కొన్నిరోజులపాటు మాత్రమే వచ్చింది. ప్రస్తుతం బస్సు రాకపోవడంతో, మహిళలు మహాలక్ష్మి పథకానికి దూరమవుతున్నారు.

నిత్యం జిల్లా కేంద్రానికి..

లింగాపూర్ మండలం ఏర్పడి ఎనిమిదేళ్లు గడిచాయి. మండలంలో 14 గ్రామ పంచాయతీలు, 20 వేలకు పైగా జనాభా ఉంది. వీటిలో అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో, మహిళలు మహాలక్ష్మి పథకాన్ని వినియోగించుకోలేకపోతున్నారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలపై ప్రయాణికులు ఆధారపడాల్సిన వస్తోంది. గ్రామీణ ప్రాంతాలకు బస్సు సేవలు ప్రారంభించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా.. పట్టించుకోవడం లేదు. జిల్లా కేంద్రం నుంచి కెరమెరి, జైనూర్, ఉట్నూర్, ఆదిలాబాద్ వరకు బస్సు సౌకర్యం ఉంది. కానీ జైనూర్ నుంచి లింగాపూర్‌కు రావాలంటే కనీసం 30 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. జైనూర్ మండలం వరకు బస్సు సౌకర్యం ఉన్నా.. సిర్పూర్(యూ), లింగాపూర్ మండలాల ప్రజలు నిత్యం జిల్లా కేంద్రాలకు వివిధ అవసరాల కోసం ప్రయాణిస్తున్నారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చినప్పుడు కొన్నిరోజులపాటు ఆసిఫాబాద్ డిపో నుంచి ఒక బస్సు అందుబాటులోకి వచ్చింది. కాని ఆ సేవలు కొద్ది రోజులకే నిలిచిపోయాయి.

బీటీ రోడ్డు ఉన్నా.. బస్సుల్లేవు..

జిల్లా కేంద్రం నుంచి మండల కేంద్రం పాటు పిక్లాతండా గ్రామం వరకు బీటీ రోడ్డుతో ఉన్నా బస్సు సేవలు లేవు. కొన్నిరోజుల పాటు ఆసిఫాబాద్ బస్టాండ్ నుంచి లింగాపూర్ వరకు బస్సు సౌకర్యం ఉండేది. అయితే సరైన ఆదాయం రాకపోవడంతో ఆ సర్వీసు నిలిపివేశారు.

ఆటోలోనే ప్రయాణిస్తున్నాం



ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోల్లోనే ప్రయాణించాల్సి వస్తోంది. ఆటోలో ప్రయాణికులు ఎక్కువగా ఉండటంతో ఇబ్బంది పడుతున్నాం. ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నాం. బస్సులో ప్రయాణించాలంటే జైనూర్ వెళ్లి అక్కడి బస్సు ఎక్కాలి.

– బానోత్ అంబాజీ, పిక్లాతండా

ఉచిత ప్రయాణానికి దూరం



మా గ్రామం నుంచి నిత్యం విద్యార్థులు, ప్రజలు జైనూర్, ఆసిఫాబాద్, ఉట్నూర్ వరకు రాకపోకలు సాగిస్తున్నారు. ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టినప్పటికీ మా గ్రామానికి బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల ఉచిత ప్రయాణానికి మేము దూరమవుతున్నాం. ఆటోల ద్వారానే రాకపోకలు సాగుతుండటంతో అధిక చార్జీలతో ఇబ్బందులు పడుతున్నాం.

– పవార్ కమ్లాబాయి, పిక్లాతండా

తీవ్ర ఇబ్బందులు..

లింగాపూర్ మండలంలోని కీమానాయక్ తండా, కొత్తపల్లి, పిక్లాతండా గ్రామాలకు రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాలకు బీటీ రోడ్డు ఉన్నప్పటికీ బస్సు సేవలు లేవు. ఆసిఫాబాద్ డిపో నుంచి జైనూర్ మీదుగా సిర్పూర్(యూ), లింగాపూర్, పిక్లాతండా వరకు ప్రధాన రహదారి ఉన్నా బస్సులు నడవడం లేదు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బ్యాడ్మింటన్ కోర్టు ప్రారంభిస్తున్న కలెక్టర్

ఆసిఫాబాద్: క్రీడలు శారీరక, మానసికోల్లాసం ఇస్తాయని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆధునీకరించిన బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ కోర్టులను బుధవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ నిత్యజీవితంలో ప్రతిఒక్కరికీ క్రీడలు ఎంతో అవసరమన్నారు. పోలీసు అంటేనే ఒత్తిడితో కూడుకున్న ఉద్యోగమని, ఒత్తిడిని తగ్గించుకునేందుకు క్రీడలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ క్రీడలను నిత్య జీవితంలో భాగం చేసుకుంటే ఆరోగ్యంగా ఉంటారన్నారు. బ్యాడ్మింటన్ కోర్టును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అదనపు ఎస్పీ అడ్మిన్ ప్రభాకర్‌రావు, ఏఎస్పీ చిత్తరంజన్, సింగరేణి జీఎం విజయ్ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ పెద్దన్న, అంజన్న, సీఐలు రవీందర్, శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

దహెగాం: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు బుధవారం మండల కేంద్రంలోని స్థానిక రైతువేదికలో ఎమ్మెల్యే హరీశ్‌బాబుచెక్కులు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 80 మందికి చె క్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కవిత, బీజేపీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని రైతువేదికలో 35 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను ఎమ్మెల్యే హరీశ్‌బాబు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు అర్హులకు చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. అంతకు ముందు మార్కెట్ ఏరియాలో ఘనపురం సుశీల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్ రావు, ఎంపీడీవో ఆల్బర్ట్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఫోన్లు అప్పగింత



రికవరీ చేసిన ఫోన్లతో పోలీసు అధికారులు

ఆసిఫాబాద్: గడిచిన మూడు నెలల వ్యవధిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు బాధితులకు అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ పోగొట్టుకుంటే వెంటనే సీఈఐఆర్ వెబ్ పోర్టల్‌లో ఫి ర్యాదు చేయాలని సూచించారు. నేరస్తులు దొంగిలించిన ఫోన్లను దుర్వినియోగం చేసే అ వకాశం ఉందని, వెంటనే సీఐఈఆర్ పోర్టల్ లేదా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాల ని సూచించారు. ఆసిఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరి ధిలో 8, కాగజ్‌నగర్ 10, కెరమెరి 3, వాంకిడి 3, రెబ్బెన 8, కౌటాల 7, కాగజ్‌నగర్ రూరల్ 3 ఫోన్లు రికవరీ చేసి తిరిగి బాధితులకు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రాణాప్రతాప్, ఐటీకోర్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఎస్సైలు సౌమ్య, తేజస్విని, కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



పోషకాహారం ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్



చిన్నారి బరువు కొలుస్తున్న సీడీపీవో విజయలక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్: 15 రోజుల పాటు పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లైలా అన్నారు. బుధవారం మండలంలోని ఈదులవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగం పోషకాహారాన్ని ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఎలాంటి పోషకాహారం తీసుకోవాలనే దానిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పద్మ, మంజుల, రమాదేవి పాల్గొన్నారు.

కౌటాల: ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని సీడీపీవో విజయలక్ష్మి అన్నారు. మండల కేంద్రంలోని నదిమాబాద్ అంగన్‌వాడీ సెంటర్‌లో బుధవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. చిరుధాన్యాలు తింటే ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కరుణ, హెల్త్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు జీజాబాయి, సుజాత, భూదేవి, రమా, విజయ, సరోజ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



బహుమతులు ప్రదానం చేస్తున్న నాయకులు

తిర్యాణి: క్రీడల్లో గెలుపోటములు సహజమని కాంగ్రెస్ నాయకులు జువ్వాజి అనిల్ గౌడ్ అన్నారు. మండలంలోని రొంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు ఆత్రం గణేశ్ స్మారక వాలీబాల్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల్లో విజేతగా నిలిచిన బెజ్జూర్ మండలం మర్థిడి జట్టు, రన్నరప్‌గా నిలిచిన దేవాపూర్ జట్టుకు నగదుతో పాటు బహుమతులు ప్రదానం చేశారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడల్లో ప్రతిభ కనబర్చాలన్నారు. కార్యక్రమంలో గిరిజన శాఖ జిల్లా క్రీడాల అధికారి మీనా రెడ్డి, ఆత్రం సక్కు, వినోద్, లక్ష్మణ్, సుభాశ్, శ్రీనివాస్, గోపాల్, కృష్ణారావు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

దహెగాం: మండల కేంద్రంలోని స్థానిక పశువైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. పశువైద్యాధికారి రమేశ్ మాట్లాడుతూ.. గాలికుంటు నివారణ టీకాలు వచ్చే నెల 15 వరకు వేయడం జరుగుతుందన్నారు. పశువైద్య సిబ్బంది వచ్చినప్పుడు పశువులకు తప్పని సరిగా టీకాలు వేయించాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది నరేశ్, మల్లేష్, సురేశ్, హనుమయ్య పాల్గొన్నారు.

ఉచ్చులు.. ఉరులు..!

- వన్యప్రాణులకు రక్షణ కరువు
- జిల్లాలో యథేచ్ఛగా వేట
- అదుపు చేయలేకపోతున్న అటవీశాఖ

జిల్లాలోని అడవుల వివరాలు	
అటవీ విస్తీర్ణం	2,44,540 హెక్టార్లు
డివిజన్లు కాగజ్‌నగర్, ఆసిఫాబాద్	
అటవీ రేంజ్‌లు	11
ఎఫ్ఆర్‌వోలు	11
డీఆర్‌వోలు	23
ఎఫ్ఎస్‌వోలు	44
ఎఫ్‌బీవోలు	154



నీల్గాయిని వేటాడిన కేసులు పట్టుబడిన నిందితులతో అధికారులు (ఫైల్)

కౌటాల: జిల్లాలో ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఈ క్రమంలో అడవుల్లో అనుకూల వాతావరణం లేకపోవడంతో వన్యప్రాణులు వనాలు విడిచి జనావాసాల్లోకి వస్తున్నాయి. ఇదే అదునుగా వేటగాళ్లు వాటిని హతమార్చుతూ మాంసాన్ని విక్రయిస్తున్నారు. అటవీ జంతువుల కదలికలపై ఆశించిన స్థాయిలో అటవీశాఖ అధికారుల నిఘా లేకపోవడంతో వేటగాళ్లు దర్జాగా ఉచ్చులు, విషపు గుళికలు పెట్టి చంపుతున్నారు. కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలోని కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, దహెగాం, పెంచికల్‌పేట్, కాగజ్‌నగర్ మండలాలతో పాటు తిర్యాణి, రెబ్బెన, వాంకిడి, కెరెమెరి, లింగపూర్ మండలాల్లో విస్తారంగా అడవి ఉంది. ముఖ్యంగా కుందేళ్లు, దుప్పులు, జింకలు, పులులు, పక్షులు, ఇతర వన్యప్రాణులు ఉన్నాయి. కానీ వాటికి రక్షణ లేకుండా పోతుందని పలువురు వాపోతున్నారు.

వన్య ప్రాణులకేది రక్షణ..

అడవులను రక్షించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అటవీశాఖ అధికారులకు ఆధునాతన వాహనాలను సమకూర్చింది. అయినా అటు అడవులు, ఇటు వన్యప్రాణులు వధకు గురికాక తప్పడం లేదు. కొందరు జంతువుల మాంసం విక్రయించి సొమ్ము చేసుకునేందుకు వేట కొనసాగిస్తున్నారు. గుట్టుచప్పుడు కాకుండా వన్యప్రాణులైన పిట్టలు, జింకలు, దుప్పులు, కుందేళ్లు, అడవిపందులు మాంసం విక్రయిస్తున్నారు. ముఖ్యంగా పంట చేలు అడవులకు సమీపంలో ఉండడంతో వేటగాళ్లు విద్యుత్ తీగలు అమర్చి వన్యప్రాణులను వేటడుతున్నారు.

నిఘా లేకపోవడంతో..

కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో గతేడాది పెద్ద పులులు మృతి చెందిన సంఘటన రాష్ట్రంలోనే సంచలనం రేపింది. జాతీయ జంతువు, అంతరించిపోతున్న జంతువుల జాబితాలో ఉన్న పెద్ద పులులకే కాగజ్‌నగర్ అటవీప్రాంతంలో రక్షణ లేకుండా పోవడంతో దుప్పులు, జింకలు, ఇతర అటవీ జంతువులకు రక్షణ ఎక్కడ ఉంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో నిత్యం వేట యథేచ్ఛగా సాగుతుంది. అడవి జంతువులు, పులుల సంరక్షణకు అటవీశాఖ అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదనే అపవాదు ఉంది. అటవీ జంతువుల వేటాడిన కేసుల్లో పలువురిని రిమాండ్‌కు తరలిస్తున్నా.. వేటగాళ్లలో మాత్రం మార్పు రావడం లేదు. వకాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న వన్యప్రాణుల వేటకు అధికారులు అడ్డుకట్ట వేయాలని జంతుప్రేమికులు కోరుతున్నారు.

ఇటీవల జరిగిన ఘటనలు

మార్చి 2న పెంచికల్‌పేట్ మండలం నందిగామ వద్ద అడవి జంతువులను హతమార్చేందుకు విద్యుత్ తీగలను అమర్చిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

- మార్చి 14న పెంచికల్‌పేట్ మండలం ఆగర్‌గూడ బీట్‌లో నీలుగాయిని వేటాడిన నలుగురు వ్యక్తుల పైన కేసులు నమోదు చేసి విద్యుత్ తీగలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు.
- మార్చి 15న రాత్రి పెంచికల్‌పేట్ మండలం లోడుపల్లిలో చుక్కల దుప్పిని హతమార్చిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసి దుప్పి చర్మం స్వాధీనం చేసుకున్నారు.
- మార్చి 22న కౌటాల సమీపంలోని అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఉచ్చులు బిగించి వన్యప్రాణులను వేటాడిన విశాల్ అనే వ్యక్తి ఇంట్లో జింక మాంసం లభ్యమైంది.
- మార్చి 28న పెంచికల్‌పేట్ మండలం లోడుపల్లి అటవీ సెక్షన్ పరిధిలో నీల్గాయి వేటాడి మాంసం తరలిస్తున్న కేసులో ఆరుగురిపై కేసు నమోదు చేశారు.

చర్యలు తీసుకుంటాం

వన్యప్రాణుల వేటడడం నేరం. వన్యప్రాణులను వేటాడితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తాం. పెద్దపులి సంచారం ఉన్న గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వన్యప్రాణులతో పంటలకు, పశువులకు నష్టం జరిగితే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలి.

– ఇక్బాల్, ఎఫ్ఆర్‌వో, సిర్పూర్(టి)

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండల కేంద్రంలోని పలు కాలనీలకు గురువారం విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ ఇమ్రాన్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదర్శ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, శ్రీరామ కాలనీ, బృందావన కాలనీతో పాటు ప్రధాన రహదారి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరాఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

సీసీరోడ్డుకు శంకుస్థాపన



శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని అందవెల్లి గ్రామపంచాయతీలో సీసీ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు శంకుస్థాపన చేశారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద రూ. 10 లక్షల రూపాయల అంచనా వ్యయంతో మంజూరైన సీసీ రోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా బీజేపీ ముందుకు సాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు చన్నపురి గణపతి, దోతుల శ్రీనివాస్, మల్లేశ్, శ్రావణ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.